పొలాలు...ఇళ్లస్థలాలుగా మార్పు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - జగ్గంపేట : రెండు పంటలు పండే పచ్చటి పొలాల్లో మట్టి నింపి ఇళ్ళ స్థలాలుగా మార్చేస్తున్నారు. కళ్లెదుటే జరుగుతున్నా ఇక్కడ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట పరిధి 75 ఎకరాల్లో జగనన్న లే అవుట్లు వేసి రెండు గ్రామాలకు ఇళ్ళ స్థలాలుగా ఇచ్చారు. అక్కడ ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్నాయి. రానున్న రోజుల్లో డిమాండ్ పెరుగుతుందనే ఉద్దేశ్యంతో కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు జగనన్న స్థలాలకు దగ్గరలోని పంట పొలాలను కొనుగోలు చేసి ఇళ్ళ స్థలాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆ పంట పొలాలను ఎత్తు చేసేందుకు ఆ సమీపంలోని పారిపిల్లమ్మతల్లి చెరువు గట్టు మట్టిని యథేచ్ఛగా తరలించారు. ఆ సమీపంలోని మరో చెరువు నుండి మట్టిని తరలించి నింపుతున్నారు. నింపుతున్న మట్టికి అనుమతులు లేవు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన కన్వర్షన్ ఫీజులు చెల్లించకుండా మట్టి నింపుతున్నా రెవిన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ జగనన్న కాలనీకి ఆనుకుని లే అవుట్ చేసేందుకు మట్టిని నింపుతున్న ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని అన్నారు.

వెంటనే వీరిపై చర్యలు తీసుకుని, ఫైన్ విధించాలన్నారు. దళిత ప్రజా చైతన్యం వ్యవస్థాపక అధ్యక్షులు మురారి రవి కుమార్ మాట్లాడుతూ రెండు పంటలు పండే భూములను ఇళ్ల స్థలాలుగా మారుస్తున్నా రన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించకుండా మట్టి నింపుతున్నారని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్, బుసి శ్రీదేవి జగ్గంపేట మండలంలో ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు ఎక్కడా ఇవ్వలేదన్నారు. సర్వే నెంబర్ 74లో మట్టిని నింపే రైతుకు నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-కొవ్వూరు :కొవ్వూరు నియోజకవర్గంలో ఈ నెల 24న ముఖ్యమంత్రి పర్యటనను అందరూ విజయవంతం చేయాలని రాష్ట్ర హోం మంత్రి, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత కోరారు. ఈ మేరకు ఆదివారం హోంమంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ బుధవారం నాడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. సత్యవతి నగర్ లో క్యాంప్ ఆఫీస్ ఎదురుగా వున్న స్థలంలో సభ నిర్వహిస్తామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సీఎం జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా అందరూ విచ్చేసి సభను విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

గోదావరిలో పడి ఇటుక బట్టీ కార్మికుడి మృతి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా కేదార్లంకలో ఇటుకు బట్టీలో పనిచేస్తున్న కార్మికుడు శుక్రవారం గోదావరిలో పడి మృతి చెందాడు. అంగర ఏఎస్ఐ రంగారావు ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒరిస్సా నుంచి రెండు నెలల క్రితం కార్మికుడు శోభన్ కేదార్లంకలో పోలిశెట్టి గణేష్‌కు చెందిన బట్టిలో పనికి చేరాడు. శుక్రవారం గోదావరి నదిలో స్నానానికి దిగిన శోభన్ ఆదివారం కోరుమిల్లిలో శవమై తేలాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రంగారావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - జగ్గంపేట : 21 సంవత్సరాల క్రితం ఒకే చోట చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆదివారం జగ్గంపేటలో కలుసుకున్నారు. 2001-2002 సంవత్సరంలో జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థినీ విద్యార్థులు జగ్గంపేట శివ పార్వతి ఫంక్షన్ హాల్లో కలిశారు. వారంతా తమ చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను వారు ఘనంగా సత్కరించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - చాగల్లు : మండుతున్న ఎండలతో అల్లాడి పోతున్న పాదచారులు, వాహనదారులు దాహార్తిని తీర్చేందుకు పారా మిలటరీ వెల్ఫేర్ అసోసియేషన్ కొవ్వూరు డివిజన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం చాగల్లు మెయిన్ బజార్లో బస్టాండ్ పక్కనమజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి ప్రభాకర్ రావు, మాణిక్యాలరావు, డి ప్రసాద్, షేక్ సర్దార్ భాష తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - అనపర్తి : కుతుకులూరులో గ్రామ దేవత అనపాలమ్మ అమ్మ వారిని జాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరి సాయి కృష్ణారెడ్డి, పులగం వీర వెంకట సత్యనారాయణ రెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వెంకట మురళీకృష్ణ రెడ్డి, కొవ్వూరి నాగార్జున రెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి ఉపసర్పంచ్ ఆర్థిక సహకారం

విశాలాంధ్ర - కాజులూరు : గొల్లపాలెంలో ఇటీవల వడదెబ్బకు గురై మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు కాపూరి రాంబాబు (రాముడు) కుటుంబీకులకు గ్రామ ఉపసర్పంచ్, అలయన్స్ క్లబ్ అధ్యక్షులు తాడి భువనేశ్వరీవాసురెడ్డి ఆర్థిక సహకారం అందజేసారు. స్థానిక గ్రామ పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిపై పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న రాముడు గత బుధవారం వడదెబ్బకు గురై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉపసర్పంచ్ భువనేశ్వరీవాసురెడ్డి ఆదివారం వైఎస్సార్సీపీ మండల ప్రధానకార్యదర్శి పోతురాజు బాబురావు. యువజన విభాగ కార్యదర్శి నిమ్మితి విజయ్ తదితరులతో కలసి వెళ్లి మృతుని కుటుంబీకులను పరామర్శించి బస్తా బియ్యం, నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, కూరగాయలు, రూ.ఐదువేలు నగదు అందజేసారు. ఈ సందర్భంగా విధినిర్వహణలలో రాముడు సేవలను నాయకులు కొనియాడారు. అనన్య నూట్రీషన్ క్లబ్ సభ్యులు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - మండపేట : రోజు రోజుకీ ఎండ తీవ్రత పెరిగిపోతున్న తరుణంలో ఇళ్ల నుండి అనేక పనుల నిమిత్తం రోడ్ల మీదకు వచ్చే ప్రజానీకం దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహద పడతాయని మాజీ కౌన్సిలర్ లంకలపల్లి రాంబాబు, సంత మార్కెట్ వర్తక సంఘం ప్రెసిడెంట్ చింతలపూడి సత్తిబాబు అన్నారు. సంతమార్కెట్ వీధిలో ఆదివారం సంత మార్కెట్ వర్తక సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. మార్కెట్ యువత శ్రీ కృష్ణ దేవరాయలు పేరు మీద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో వారు పాల్గొని బాటసారులకు మజ్జిగ అందించారు. సేవా కార్యక్రమంలో సంత మార్కెట్ యువత సత్తి వెంకన్న, పాలతోడు శ్రీను, రాయి నాని, పలివెల జానకి, పూసల సత్తిబాబు, గంగుమళ్ల శ్రీను, షేక్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ పరీక్షల్లో మహతి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - సీతానగరం : ఆంధ్రప్రదేశ్ పాలిటెక్నిక్ పరీక్షల్లో మహతి విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా శ్రీ మహితి పాఠశాల కరస్పాండెంట్ ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పాలిటెక్నిక్ పరీక్షల్లో పాతూరి వెంకటేష్ స్టేట్ 184వ ర్యాంకు, నందన ప్రైస్ 474, కోమలి ఓజంత రాజ్ 779వ ర్యాంకు సాధించారని తెలిపారు. 500లోపు 2, 1000లోపు 4, 5000లోపు 6, పదివేల లోపు 13మంది ర్యాంకులు సాధించి రాజానగరం నియోజకవర్గంలోనే శ్రీ మహతి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పరీక్షకు హాజరైనవారంతా 100 శాతం అర్హత సాధించారని ఐఐటి అకాడమిక్ డైరెక్టర్ రామ్ ప్రసాద్ తెలియజేశారు.

సీకులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - పెదపూడి : కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన జి.మామిడాడ గ్రామంలోని సీకులమ్మ వారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి , ఆదిలక్ష్మి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఉత్సాహంగా నిర్వహించాలన్నారు. గ్రామ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహించడంతో ఆ గ్రామాలు సిరిసంపదలతో సస్యశ్యామలంగా సుభిక్షంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి.. ఎజెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, వైస్ఎంపీపీ ద్వారంపూడి పద్మరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు అభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: మహిళా సంఘాలు కార్పొరేట్ స్థాయిలో చేయూత అమలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించుకోవాలని తూర్పుగోదావరి జిల్లా డిఆర్డిఏ పిడి సుభాషిని పిలుపునిచ్చారు దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా సిఆర్పీలు సూపర్వైజర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వస్తువు అతి తక్కువ ధరకు అందరికీ లభ్యమయ్యేటట్లు మహిళలు సంఘాలుగా ఏర్పడి షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెలలో నల్లజర్లలో షాపింగ్ మాల్ ఏర్పాటు చేస్తామని హామీ నిచ్చారు. పాల సేకరణ కూడా పెంపొందించుకోవాలని అన్నారు. ఇప్పటికి ప్రతిరోజు 3000 లీటర్లు సేకరణ జరుగుతుందని వచ్చేవారం నుండి నాలుగు వేల లీటర్లకు పెంచుకోవాలని ఆమె సూచించారు. జిల్లాలో తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో పాల సేకరణ మరింత పెంచవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల ప్రత్యేక అధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఎంపీడీవో కల్లూరి ఉమామహేశ్వర శర్మ తాసిల్దార్ రామకృష్ణ వెలుగు ఏపీఓ శ్రీనివాస్ దేవరపల్లి నేనునల్లజర్ల గోపాలపురం మండలాలకు చెందిన డ్వాక్రా సూపర్వైజర్లు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

విశాలాంధ్ర- రాజమండ్రి: ఈనెల 23వ తేదీ మంగళవారం ఉదయం 9.00 గంటలకు కలెక్టరు కార్యాలయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్‌లో "మినీ జాబ్ మేళ" జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండల రావు తెలిపారు. రాష్ట్రనైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న మంగళవారం ఉదయం 9.00 గంటలకు తూర్పుగోదావరి జిల్లాలోని స్థానిక జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్‌లో "మినీ జాబ్ మేళ" నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండల రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రముఖ డెల్టాహాస్పిటల్స్, రాయల్ ఎన్ఫిల్డ మరియు మోహన్ స్పిన్ టెక్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు హాజరు కానున్నాయని, వీటిలో గల వివిధ ఉద్యోగాలలో పనిచేయుటకు ఏదైనా డిగ్రీ తో పాటుగా కంప్యూటర్ నైపుణ్యాలు కలిగిన వారు, బిఎస్సి నర్సింగ్, జిఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసిన, ఇంటర్ పాసైన వారు, 7వ తరగతి నుండి పై చదువులు చదివిన వారు 19 నుంచి 39 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. ఈ నెల 23 వ తేదీ మంగళవారం ఉదయం 9.00 గంటలకు జిల్లా కలెక్టరు వారి కార్యాలయం (బొమ్మూరు హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా) నందు గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ వద్దకు రావాలని మరిన్ని వివరాలకు "9133912947", "9581810049" నెంబర్లను సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు ఎస్పీతో కలెక్టరేట్లో ప్రత్యేక స్పందన

విశాలాంధ్ర- రాజమండ్రి: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా మే 22 సోమవారం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సిహెచ్. సుధీర్ కుమార్ రెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం క్షేత్ర స్థాయి లో డివిజన్, మండల, గ్రామ స్థాయి స్పందన కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్పీతో కలిసి తొలిసారిగా అర్జీలను ప్రజల నుంచి స్వీకరిస్తామన్నారు. ఇకపై ప్రతి నెల 3 వ సోమవారం కలెక్టర్, ఎస్పీ లు కలెక్టరేట్ కు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు తెలిపారు.

మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - అనపర్తి : నియోజవర్గ ప్రాంతంలో బొండాల రకం వరిని ఎక్కువ శాతం రైతులు పండించారని ఆ ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నదని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఆదివారం రామవరంలో నల్లమిల్లి విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని అన్నారు. రైతులకు రక్షణగా తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుందని ఈ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయకపోయినా టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఆదుకోవడం జరుగుతుందని రామకృష్ణారెడ్డి తెలిపారు.

కన్నబాబు వెంటే మా ప్రయాణం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : సుమారు ఏడు కోట్లతో కొవ్వూరు గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన ఘనత మాజీ మంత్రి ,జిల్లా వైకాపా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే కురసాల కన్నబాబుదని, వచ్చే ఎన్నికల్లో ఆయన వెంటే మళ్లీ ప్రయాణం సాగిస్తామని, అఖండ మెజారిటీతో కన్నబాబుని ఎమ్మెల్యేగా గెలిపించి, మళ్లీ మంత్రిగా చూడాలని వైయస్సార్సీపి బీసీ నాయకులు కొవ్వూరు గ్రామ సర్పంచ్ పిల్లి చక్రధర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక వైద్య నగర్ కన్నబాబు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబును సర్పంచ్ పిల్లి పిల్లిచక్రధర్‌రావు, ఎంపీటీసీ కొండేటి లీలావతి బుచ్చిరాజు, గ్రామ వైఎస్ఆర్సిపి బిసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తన గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసిన శుభ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎంపీటీసీ లు మాట్లాడుతూ తారక మా నగర్ నుండి కొవ్వూరు గ్రామం వరకు తారు (బీటి) రోడ్డు, గ్రామంలో నాడు నేడు, సిసి రోడ్లు, త్రాగునీరు, డ్రేన్స్, జల జీవన మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి, వీధిలైట్లు, వాటర్ ట్యాంకులు, రైతు భరోసా కేంద్రాలు, రైతులకు సాగునీరు కల్పించి, సచివాలయాలు ఏర్పాటు చేసి, గ్రామ ప్రజలకు అభివృద్ధి ప్రదాతగా కన్నబాబు నిలిచిపోయారని మునిపెన్నడూ లేని అభివృద్ధి సీఎం జగనన్న ముఖ్యమంత్రిగా వైయస్సార్ పార్టీలో జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

అందరికీ పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా

విశాలాంధ్ర - పెదపూడి : నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలందరికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో రూ.11లక్షలతో నూతనంగా నిర్మించిన తాగునీరు బోరువెల్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి ఎండల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలకు తాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఆ చర్యల్లో భాగంగా పెదపూడి గ్రామంలో ప్రజలకు తాగునీరు నిమిత్తం అదనంగా బోరువెల్, విద్యుత్ ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేసి దాని నుంచి నీటిని సమగ్ర రక్షిత తాగునీరు సరఫరా ట్యాంకులలోకి ఎక్కించి అనంతరం ప్రజలకు సరఫరా చేస్తున్నారన్నారు. మండలంలోని గ్రామాల్లో సుమారు రూ.15 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో తాగునీరుకి సంబంధించి పైపులైన్లు ఆధునీకరణ, నూతన వాటర్ ట్యాంక్లు నిర్మాణం, ఇంటింటికి కుళాయి మొదలగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి. వైఎస్సార్సీపీ మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, కోరా వీర్రాజు చౌదరి, పార్టీ గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలుణ్ణి దత్తత తీసుకున్న ఎమ్మెల్సీ తోట

విశాలాంధ్ర - మండపేట : ప్రభుత్వం తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మనసును కదిలించే సంఘటనొకటి ఎదురైంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణం 13వ వార్డులో వైస్ చైర్మన్ పిల్లి గనేశ్వరరావు తదితర నాయకులతో కలిసి వార్డులో పర్యటిస్తున్నారు. ఎప్పటి లాగే తోట త్రిమూర్తులు స్థానికులతో ముచ్చటిస్తూ తన మాటలతో చేరువయ్యే క్రమంలో ఓ ఇంటి లోపలి నుండి బాలుడు బయటకు వచ్చాడు. ఏరా బాబూ బాగున్నావా అంటూ లాలనతో దగ్గరకు తీసుకున్నారు. దానికి ఆ బాలుడు నాకు చదువుకోవాలని వుంది. కానీ, నాన్న లేక చదువుకోలేక పోతున్నాను అని చెప్పడంతో ఆ పసివాడి మాటలకు చలించి పోయిన ఎమ్మెల్సీ తోట వెంటనే బాలుడికి అభయమిచ్చారు. నీ చదువు బాధ్యత నేను తీసుకుంటా నంటూ ఎంత దాకా చదువు కుంటావో చదువు కోరా బాబూ అని బాలుడికి అభయం ఇవ్వడంతో చుట్టూ ఉన్న నాయకులు, స్థానికులు చప్పట్లు ద్వారా ఆనందాన్ని వ్యక్త పరిచారు. బాలుడి విషయంలో ఎమ్మెల్సీ తోట చూపించిన మానవ తను ప్రజలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను వేనోళ్ళ కొనియాడుతున్నారు.

మండల వ్యాప్తంగా వడగళ్ల వాన

విశాలాంధ్ర - సీతానగరం : సీతానగరం మండలంలో వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అర గంట సమయం గోలీ అంత సైజులో వడగళ్ల వాన కురిసింది. దీంతో మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది. అసలే ఈ ఏడాది మామిడి కాయ కాపు తక్కువగా ఉండడం ఈ వడగళ్ల వాన కురవడంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం మిగలనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం ఇంకా 10 శాతం అనగా 500 మెట్రిక్ టన్నులు ధాన్యం రైతుల పొలాలలో, కల్లాల్లో ఉంది. ఈ అకాల గాలి, వడగళ్ల వానకు ధాన్యం కూడా దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మలేషియాలో ఎర్రంపాలెం మహిళ మృతి

విశాలాంధ్ర - జగ్గంపేట : పొట్టకూటి కోసం వెళ్లి మలేషియాలో మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామానికి చెందిన దంగిడి సత్యవేణి శుక్రవారం మృతి చెందింది. మృతురాలు భర్త గత ఏడేళ్ల క్రితమే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయికి వివాహం చేసి ఐదేళ్ల క్రితం మలేషియాకు ఉపాధి కోసం వెళ్ళింది. శుక్రవారం గుండెపోటుతో మృతి చెందడంతో తోటి ఉపాధి మహిళలు కుమార్తెలకు సమాచారం అందించారు. తమ తల్లి సత్యవేణి పంపిస్తున్న డబ్బులతోనే కుటుంబ పోషణ చేసుకుంటున్నామని, ఇప్పుడు తల్లి మృతదేహం తెచ్చుకునేందుకు కూడా సొమ్ములు లేవని కుమార్తెలు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన రాజీవ్ గాంధీ

విశాలాంధ్ర - అమలాపురం : భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగింది. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి అమలాపురం స్థానిక హైస్కూల్ సెంటర్లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పితాని వారి పాలెంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి, నల్ల వంతెన వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమలాపురం ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, రొట్టలు బిస్కెట్లు పంపిణీ చేశారు. రుద్రరాజు మాట్లాడుతూ ఆధునిక శాస్త్ర సాంకేతిక టెక్నాలజీని ప్రవేశపెట్టి 74,75 రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు, విధులు కల్పించి, గ్రామీణ వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కుడిపూడి శ్రీనివాస్, నిమ్మకాయల ప్రసాద్, దామి శెట్టి జయ, సుగ్గ ప్రసాద్, యార్లగడ్డ రవీంద్ర, దేవరపల్లి రాజేంద్ర బాబు, ఆకుల వెంకటరెడ్డి నాయుడు, అడ్వకేట్ బాబి, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో : భారత మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని జగ్గంపేటలో నిర్వ హించారు. వర్ధంతి సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శివ గణేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి స్థానిక జగ్గంపేట అంబేద్కర్ నగర్ వద్ద గల రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మామిడికుదురులో: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మామిడికుదురు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సెంటర్లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు గెద్దం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ అతి పిన్న వయసులోనే భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం, శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అప్పన రామకృష్ణ, నాయకులు నీతిపూడి బాల సత్యనారాయణ, వాకపల్లి రాంబాబు, ఆకుమర్తి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో : భారత మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమాన్ని అంబాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు నెల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందు తీసుకెళ్లిన ఘనత రాజీవ్‌గాంధీదే అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్లు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆరిఫ్, ఆదుర్తి నారాయణమూర్తి, మహమ్మద్ ఇస్మాయిల్, కొల్లి సరోజని, మహమ్మద్ అబిబి, తదితరులు పాల్గొన్నారు.

సాయిరాజ్‌కి సత్కారం

విశాలాంధ్ర - కాకినాడ : దుబాయ్‌లో జరిగిన ఏషియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలలో 20 దేశాలు పాల్గొనగా అందులో మన భారతదేశం 53 సంవత్సరాల తర్వాత భారతదేశానికి స్వర్ణ పతకాన్ని సాధించిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌కిని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బులియన్ అసోసియేషన్ బిల్డింగ్‌లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బోణం సత్యవర ప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ఉపాధ్యక్షులు చిట్టూరి పెదబాబు, ముఖ్య సలహాదారులు కంచిపల్లి అబ్బులు, నల్లా పవన్ కుమార్. సలహాదారులు రేకపల్లి సూరిబాబు, చింతలపూడి సత్తిబాబు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షులు మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శి రాయుడు నాని, కార్యవర్గ సభ్యులు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వర రావు (ఈసు) వలవల శివరావు, అనుపోజి శీను, వర్రీ బాబి, గొకరకొండ గంగన్న స్వామి, ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, సంద్యాల బాబి, నంబూరి నరేష్, మండవల్లి మురళీకృష్ణ, తాళబత్తుల కొండ, సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా బాబు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన దినవహి పేర్రాజు (బాబు) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. అనంతరం పేరు బాబును ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దుశ్శాలువతో, పూలదండ వేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ వైకాపా పార్టీలో చురుకైన పాత్ర పోషించి, పార్టీ అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేసిన పేరు బాబుకు ఇలాంటి పదవి రావడం బ్రాహ్మణ జాతికే గర్వకారణం అన్నారు. అనంతరం స్టేట్ సివిల్ సప్లై స్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మల మడక నాగమణి రామ శర్మ దంపతులు పేరు బాబును దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ భవన్ ఆర్గనైజర్, ప్రెస్ క్లబ్ ఆఫ్ కోకనాడ గౌరవ సలహాదారుడు వివిఎస్ ప్రకాష్ రావు మాట్లాడుతూ బ్రాహ్మణ జాతికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పేరు బాబు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కన్నబాబు సహకారం మరువలేను అని, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ గోగులమ్మ అమ్మవారి జాతరలో ట్రాఫిక్‌కు అంతరాయం

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని ఊనగట్ల గ్రామ దేవత అయిన శ్రీ గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవ సంబరాలు కనులు పండుగ గాజరుగుతున్నాయి. ఊరంతా పండుగ శోభ సంతరించుకుంది. జాతరలో భాగంగా శనివారం సంబరం చేశారు. ఆదివారం ఊరంతా అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుని భోజనాలు పెట్టుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా జాతరకు వచ్చి భోజనం చేసి వెళ్లే వారందరూ అందరూ ఒకేసారి బయలుదేరడంతో ఊరిలో ఒక్కసారిగా ట్రాఫిక్ సమస్య వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దాదాపు మూడు గంటలు గా ఉన్న ట్రాఫిక్ పునరుద్ధరించారు.